సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 17 । మే । 2025



టన్ను చీనీ రూ.35,100

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35,100, కనిష్టంగా రూ.6,200 ప్రకారం ధర పలికాయి.



హంద్రీ-నీవా సామర్థ్యాన్ని పెంచాలి

హంద్రీ-నీవా కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులక పెంచితేనే రాయలసీమ ప్రాంతం అభివృద్ధి సాధ్యమవుతుందని జలసాధన సమితి సభ్యులు అన్నారు. IIలో

గరిష్టం/కనిష్టం
37.2°/21.8°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తప్పుల్లేని ఓటరు జాబితానే లక్ష్యం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ విజయ సారథి

ప్రశాంతి నిలయం: 'తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యం. దీనికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి' అని డీఆర్‌ఓ విజయసారథి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తప్పులు లేని ఓటరు జాబితా, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఓటరు నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లెయిమ్‌లకు సంబంధించిన అంశాలపై చేసిన దరఖాస్తుల స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఓటర్ల రేషనలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల ద్వారా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వివరాలు సేకరించి సన్నద్ధంగా ఉంటే ప్రక్రియను సులువుగా పూర్తిచేయొచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున రవినాయక్, టీడీపీ తరఫున ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ తరఫున లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ ప్రతినిధి అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ కార్డుపై లేపాక్షి నంది



నంది చిత్ర నమూనాను ఆవిష్కరిస్తున్న అధికారులు

లేపాక్షి: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన లేపాక్షి విశిష్టత ప్రపంచానికి తెలియజేయడానికి నంది చిత్రం కలిగిన పోస్టుకార్డు ఎంతో దోహపడతుందని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక లేపాక్షిలోని చేతన కన్వెన్షన్ హాల్‌లో నంది చిత్రంతో కూడిన శాశ్వత తపాలా ముద్రను, వీరభద్రస్వామి దేవస్థానంపై ప్రత్యేక కార్డులను ఆయన విడుదల చేశారు. ముందుగా ఇటీవల ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్మినెంట్ పిక్టోరియల్ కాన్సిలేషన్ ద్వారా కార్డులు విడుదల చేయడం సంతోషంగా ఉదన్నారు. ఇది లేపాక్షికి ప్రత్యేకమైన రోజన్నారు. లేపాక్షి పోస్ట్ ఆఫీసు నుంచి ఏ ఉత్తరం వచ్చినా ఈ కాన్సిలేషన్ ద్వారా ఆ ఉత్తరం వెళ్లడం జరుగుతుందన్నారు. దేశం మొత్తానికి ఈ కార్డులను పంపించవచ్చన్నారు. నంది విగ్రహం, కల్యాణ మంటపం, వినాయక విగ్రహం, ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం, సీతమ్మ పాదం, వేలాడే స్తంభం చిత్రాల కార్డులను విడుదల చేశారు. ఈ కార్డులను శుభ కార్యాలకు, స్నేహితులు, ఇతరులకు బహుమతి ఇవ్వొచ్చన్నారు. ఈ కార్డులు స్థానిక పోస్టు ఆఫీసులో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం లేపాక్షి విశిష్టతను తెలిపేలా కవి సడ్లపల్లి చిదంబరరెడ్డి రాసిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్నూలు రీజినల్ పోస్టుమాస్టర్ జనరల్ వెన్నం ఉపేంద్ర, పోస్టల్ సూపరింటెండెంట్ విజయ కుమార్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక దీప్తి.. విశ్వఖ్యాతి



కరువు సీమలో సాంకేతిక దీప్తిగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ (అనంతపురం) మరో స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఎంతో మంది శాస్త్రవేత్తలు, ఇంజినీరింగ్ నిపుణులను దేశానికి అందించిన జేఎన్‌టీయూ(ఏ)14వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా జరగనుంది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 49 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, గౌరవ డాక్టరేట్‌ను లారస్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ చావాకు అందజేయనున్నారు. ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు.

- నేడు జేఎన్‌టీయూ (ఏ) 14వ స్నాతకోత్సవం
- చాన్సలర్ హోదాలో ప్రసంగించనున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్
- లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ఫౌండర్ డాక్టర్ సత్యనారాయణ చావాకు గౌరవ డాక్టరేట్
- 40,109 మంది విద్యార్థులకు డిగ్రీలు. 167 మందికి పీహెచ్‌డీల ప్రదానం



ముస్తాబైన జేఎన్‌టీయూ ఆడిటోరియం



అతిథుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

అనంతపురం: విశ్వఖ్యాతిగాంచిన జేఎన్‌టీయూ (ఏ) విశ్వవిద్యాలయం ఎందరో శాస్త్రవేత్తలు, ఇంజినీరింగ్ నిపుణులను ప్రపంచానికి అందించింది. ఏర్పడిన అనతి కాలంలోనే బీటెక్, బీ-ఫార్మసీ, ఫార్మా-డీ, ఎంటెక్, ఎం-ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు అందిస్తోంది. అలాగే పరిశోధనల్లో నాణ్యతా ప్రమాణాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. విదేశీ వర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకుని నూతన ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి తెచ్చింది. వర్సిటీ పరిధిలో అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 68 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు, 43 ఫార్మసీ కళాశాలలు, 24 ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ఏటా 1.30 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్నారు. జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల, కలికిరి ఇంజినీరింగ్ , పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లోనూ పరిశోధన చేయడానికి వీలుగా 16 రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో గణనీయమైన ర్యాంకు దక్కించుకుని అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకుంది.

చేయూత అ'పూర్వ'ం

క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పడి 78 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గతంలో ఇక్కడ చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వర్సిటీ పురోగతికి చేయూతనందించారు. రూ.8 కోట్ల వ్యయంతో 100 గదులతో కూడిన హాస్టల్‌ను పూర్వ విద్యార్థుల పేరుతో ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. రూ.50 లక్షలు విలువైన ల్యాబ్‌నూ ఏర్పాటు చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ

జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో 2024–25లో బీటెక్ పూర్తి చేసిన మొత్తం 226 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చాటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు దక్కించుకున్నారు. వీరిలో 10 మందికి ఏడాదికి రూ.11 లక్షల వేతనంతో కూడిన కొలువులు దక్కడం విశేషం.

జేఎన్‌టీయూ బంగారాలు:

జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ పరిధిలో 18 మందికి, జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల పరిధిలో ఏడుగురికి మొత్తం 49 బంగారు పతకాలు, ఎంటెక్‌లో ఒకరు, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో ఐదుగురి బంగారు పతకాలు దక్కాయి. వీరిలో జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి ఏకంగా ఆరు బంగారు పతకాలు దక్కించుకుని వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కాన్పూర్‌లోని ఐఐటీలో ఎమిరటర్స్ ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్ హాజరుకానున్నారు. అలాగే జేఎన్‌టీయూ (ఏ) పాలకమండలి సభ్యులు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభమై.. మధ్యాహ్నం 12:30 గంటలకు ముగుస్తుంది. ముఖ్య అతిథిగా హాజరవుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ కీలకోపన్యాసం చేయనున్నారు. లైవ్‌స్ట్రీమ్ ద్వారా స్నాతకోత్సవాన్ని వీక్షించే అవకాశాన్ని కల్పించారు.

అగ్రగామిగా తీర్చిదిద్దాలి

అన్ని రంగాల్లో జేఎన్‌టీయూ (ఏ)అగ్రగామిగా తీర్చిదిద్దాలని వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. శుక్రవారం ఆయన జేఎన్‌టీయూలోని పాలకభవనంలో స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. నాణ్యమైన పరిశోధనలతో పాటు అత్యుత్తమ బోధన ప్రమాణాలతో కూడిన సాంకేతిక విద్యను అందించే దిశగా విద్యా ప్రణాళికలో సమూలంగా మార్పు చేశామన్నారు. గౌరవ డాక్టరేట్‌ను డాక్టర్ చావా సత్యనారాయణకు అందజేయడం గర్వంగా ఉందన్నారు. స్నాతకోత్సవ సందర్భంగా డిగ్రీలు అందుకునే విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.



శుక్రవారం రాత్రి ఆడిటోరియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యువ పరిశోధకుడిగా ప్రారంభమైన 'చావా' ప్రస్థానం



ప్రతి స్నాతకోత్సవానికి విశిష్ట వ్యక్తులను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం జేఎన్‌టీయూ(ఏ) ఆనవాయితీగా పాటిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో 14వ స్నాతకోత్సవ గౌరవ డాక్టరేట్‌ను వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు లారస్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ చావాకు అందజేయనున్నారు. ర్యాన్‌బ్యాక్సీలో యువ పరిశోధకుడిగా డాక్టర్ సత్యనారాయణ చావా విజయ ప్రస్థానం మొదలైంది. మ్యాట్రిక్స్‌లో చేరిన ఎనిమిదేళ్లకే ఆ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఎదిగారు. లారస్ ల్యాబ్ వ్యవస్థాపన (2005) (హైదరాబాద్)తో భారతీయ ఔషధ ఉత్పత్తుల రంగానికి దిశాదర్శకులయ్యారు. ఈ క్రమంలోనే ఆయన్ను 2021లో సాక్షి 'బిజినెస్ పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ఘనంగా సత్కరించింది. 18 సంవత్సరాల క్రితం ఏర్పాటైన లారస్ ల్యాబ్స్ కంపెనీలో ఇప్పటి వరకూ 150 కొత్త మందులు కనిపెట్టారు. 150 పేటెంట్లు దక్కాయి. రెస్పెక్ట్.. రివార్డు..రీటైయిన్ అనే మూడు ప్రాధాన్యత అంశాలుగా ల్యాబ్స్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

చాలా సంతోషంగా ఉంది



మాది వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల. నాన్న బ్రహ్మానందారెడ్డి, అమ్మ మంజుల. నాన్న కడప స్టీల్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు. బీటెక్‌లో టాపర్‌గా నిలవడం అందులోనూ ఆరు బంగారు పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం టాపర్ (ఒక గోల్డ్‌మెడల్), ఎండోమెంట్ గోల్డ్‌మెడల్ ఫర్ బెస్ట్ అకడమిక్ ఫర్‌ఫార్మెన్స్ అమాంగ్ బాయ్స్ (ఒక గోల్డ్‌మెడల్), చల్లా సుబ్బారాయుడు ఎండోమెంట్ గోల్డ్‌మెడల్, ప్రొఫెసర్ వి. పాండురంగడు గోల్డ్‌మెడల్ (థర్మోడైనమిక్స్ సబ్జెక్టులో టాపర్), 1992 బ్యాచ్ స్పాన్సర్డ్ గోల్డ్‌మెడల్ , చుండుపల్లి వెంకట్రాయలు.. సరోజమ్మ గోల్డ్‌మెడల్ ఇలా మొత్తం ఆరు గోల్డ్‌మెడల్స్ దక్కాయి. అంతేకాక కోర్సు పూర్తికాగానే ఎల్అండ్‌టీ కంపెనీలో ట్రైనీ ఇంజినీర్‌గా ఎంపికయ్యాను.

– నంద్యాల పూజిత్ కుమార్‌రెడ్డి

• తాగునీటి కోసం ఆందోళన



రొళ్ల మండలంలోని రత్నగిరి పంచాయతీ ఉజ్జినీపురం గ్రామంలో మహిళలు నీటి కోసం ఆందోళనకు దిగారు. గ్రామంలో వాటర్ వర్క్స్ బోరుబావికి అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. వారం రోజులు గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్ బిగించి సమస్యను పరిష్కరించలేదు. దీంతో నీటి సరఫరా నిలిచిపోగా శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. రెండో రోజుల్లోగా నీటి సమస్య పరిష్కరించకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. – రొళ్ల:

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 9 రకాల బడుల ఏర్పాటు జీఓపై ఉపాధ్యాయ సంఘాలు పోరు పట్టాయి. ఇప్పటికే విజయవాడ విద్యాభవన్‌ను ముట్టడించిన సంఘాలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నాయి. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణను వ్యతిరేకంగా ఈ నెల 21న ఉమ్మడి అనంతపురం జిల్లాలోని డీఈఓ కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సర్కార్ బడులు లేకుండా చేసేందుకు కంకణం కట్టుకుందని ఆరోపించారు. డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలన్నారు.

ఈ-కేవైసీ పూర్తయ్యేదెన్నడో ?

- నేటికీ వివరాలు నమోదు చేయని 99,872 మంది లబ్ధిదారులు
- జూన్ 30 వరకూ గడువు



పుట్టపర్తి మండలం బీడుపల్లిలో ఈ-కేవైసీ చేస్తున్న పౌరసరఫరాలశాఖ అధికారులు

ప్రశాంతి నిలయం: రేషన్‌కార్డులో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులందరూ ఈ-కేవైసీ పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. గత ఐదు నెలలుగా ఈ-కేవైసీ పూర్తి చేసే ప్రక్రియ క్షేత్ర స్థాయిలో జరుగుతోంది. రేషన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే రేషన్ సరుకులు ఇచ్చే ప్రసక్తే లేదని రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. గడువును కూడా జూన్ 30 వరకూ పొడిగించారు. అయితే జిల్లాలో ఇప్పటికీ 99,872 మంది లబ్ధిదారులు ఇంకా ఈ- కేవైసీ చేయించుకోలేదు.

జిల్లాలో రేషన్‌కార్డుల సంఖ్య	5,66,971
రేషన్‌కార్డుల్లో సభ్యులుగా ఉన్న వారి సంఖ్య	16,89,531
ఇప్పటికే ఈ-కేవైసీ పూర్తయిన వారి సంఖ్య	15,62,221
ఈ- కేవైసీ పెండింగ్ ఉన్న వారి సంఖ్య	99,872
0 - 5 ఏళ్లలోపు పెండింగ్ ఉన్న వారి సంఖ్య	26,434
80 ఏళ్లు పైబడి పెండింగ్ ఉన్న వారి సంఖ్య	1,004

వందశాతం కష్టమే..

జిల్లాలో 5,66,971 రేషన్ కార్డులు ఉండగా 16,89,531 మంది సభ్యులుగా ఉన్నారు. వీరందరితో ఈ-కేవైసీ పూర్తి చేయాలని పౌరసరఫరాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికీ 99,872 మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయలేదు. గడువులోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోకపోతే రేషన్ సరుకులు అందించబోమని ప్రభుత్వం చెబుతోంది. వలస వెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ఈ-కేవైసీపై అవగాహన లేకపోవడంతో ఇబ్బంది వస్తోంది. గడువులోపు పూర్తిచేయకపోతే వారంతా నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో వంద శాతం ఈ-కేవైసీ పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.

వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతోనే ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ వలంటీర్ వ్యవస్థ చురుగ్గా పనిచేసేది. క్షేత్రస్థాయిలో ఏపనైనా సకాలంలో వలంటీర్లు పూర్తి చేసేవారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం క్షేత్రస్థాయిలో సర్వేలు సహా ఏ ఇతర పనులు కూడా సక్రమంగా జరగడం లేదన్న విమర్శలున్నాయి. వలంటీర్లు లేకపోవడంతో ఈ-కేవైసీని రేషన్ డీలర్లకు అప్పగించారు. వారు పూర్తిస్థాయిలో దృష్టిసారించకపోవడంతో ఈ-కేవైసీ పూర్తిచేయని వారి సంఖ్య అధికంగా ఉందంటున్నారు.

గడువులోగా పూర్తి చేస్తాం



రేషన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు జూన్ 30 వరకూ గడువు ఉంది. క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్ల ద్వారా గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం. లబ్ధిదారులు కూడా ఈ-కేవైసీ పూర్తి చేయించుకునేందుకు సహకరించాలి. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు కూడా రేషన్ కార్డు ఉన్న ప్రాంతానికి వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాలి.

– వంశీకృష్ణారెడ్డి,
జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి



● రైతు బలవన్మరణం

పెద్దవడుగూరు: మండలంలోని బందార్లపల్లికి చెందిన శ్రీనివాసులు (36) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య ధనలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న 3 ఎకరాల పొలంలో పత్తి పంట సాగుతో పాటు గొర్రెల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. పంటల సాగుకు చేసిన అప్పులు రూ.9 లక్షలు తీర్చే మార్గం కానరాక శుక్రవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.





హంద్రీ-నీవా సామర్థ్యాన్ని పెంచాలి

- కాలువ లైనింగ్ పనులతో భవిష్యత్తుకు సమాధి
- 31న కృష్ణానది సంగమేశ్వరం వద్ద బహిరంగ సభ విజయవంతం చేయండి


హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్న జలసాధన సమితి సభ్యులు

హిందూపురం: హంద్రీ-నీవా కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచితేనే రాయలసీమ ప్రాంతం అభివృద్ధి సాధ్యమవుతుందని జలసాధన సమితి సభ్యులు అన్నారు. 'సాగునీటి సమస్యలు - పరిష్కార మార్గాలు' అంశంపై స్థానిక పెన్షనర్స్ భవన్‌లో శుక్రవారం సదస్సు జరిగింది. జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సమితి నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. అత్యంత అల్ప వర్షపాతంలో దేశంలోనే రెండవ స్థానంలో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు హంద్రీ-నీవా వరదాయినిగా మారిందన్నారు. ఈ ప్రాజెక్టును చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. జీడిపల్లి నుంచి దిగువకు కాలువ వెడల్పు చేయకుండానే లైనింగ్ పనులు ప్రారంభించడం వల్ల నీటి సామర్థ్యాన్ని పెంచే యోచనకు కూటమి ప్రభుత్వం సమాధి కట్టినట్లుగా తెలుస్తోందన్నారు. ఇది అప్రజాస్వామిక చర్య అని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ-నీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచుతూ జీఓ జారీ చేశారని, పనులకు సంబంధించి రూ.6182 కోట్లకు పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగన్ ప్రభుత్వ జారీ చేసిన జీఓను రద్దు చేయడమే కాక, 3,850 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యానికి పరిమితం చేయడం వెనుక అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో పక్కనే ఉన్న కృష్ణానది జలాలను కాదని, రూ.80వేల కోట్లు ఖర్చుతో పోలవరం నుంచి గోదావరి జలాలను 465 కి.మీ. దూరంలో ఉన్న బనకచర్లకు తరలించి అక్కడి నుంచి రాయలసీమకు నీళ్లు ఇస్తానని సీఎం చంద్రబాబు చెబుతున్నారని, ఎవరి ప్రయోజనాల కోసం ఈ ప్రాజెక్టును చేపట్టారని ప్రశ్నించారు. పోలవరం నుంచి గోదావరి జలాల మళ్లింపు ఆలోచనను విరమించుకుని మల్యాల నుంచి జీడిపల్లి వరకు ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచడంతో పాటు జీడిపల్లి నుంచి దిగువకు 6 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం, మడకశిర బ్రాంచ్ కెనాల్ 1,500 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉండేలా కాలువలు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 3.45లక్షల ఎకరాలకు పిల్ల కాలువల ద్వారా సాగునీరు అందించాలన్నారు.

రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులకు రూ.50వేల కోట్లు కేటాయించి రెండేళ్ల లోపు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మృతనదిగా మారబోతున్న పెన్నాను బతికించుకునేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కృష్ణానదిపై సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మించాలనే డిమాండ్‌తో ఈ నెల 31న సంగమేశ్వరం వద్ద జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని రైతులు, మేధావులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు నవీన్, జమీల్, ఆదినారాయణ, అమానుల్లా, జయరామరెడ్డి, హనుమంతరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు రాజశేఖరరెడ్డి, లెక్చరర్ గంగిరెడ్డి, తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకుడు రవికుమార్, పీడీఎస్‌యూ బాబావలి, ఏఐటీయూసీ వినోద్, చలివెందుల లక్ష్మీనారాయణరెడ్డి, తిప్పేస్వామి, పలువురు ఉపాధ్యాయులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు


అవార్డులకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు షైనింగ్ స్టార్-2025 అవార్డులకు ఎంపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ రాష్ట్రంలో నిర్వహించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనపరిచిన ప్రభుత్వ పాఠశాలల్లోని టాప్ ర్యాంకర్లను ఎంపిక చేసి, షైనింగ్ స్టార్ అవార్డులను ప్రభుత్వం అందజేస్తోంది. ఈ క్రమంలో ఏపీఆర్ఎస్‌కు చెందిన డి.అఫ్రీద్, ఎస్.అహమ్మద్ హుస్సేన్, కె.లక్ష్మీనరసింహారెడ్డి, వై.విశ్వకిరణ్, కె.అశోక్‌కు అవార్డులు దక్కాయి. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ ఎన్‌వీ మురళీధర్‌బాబుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

లైనింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి


కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

తనకల్లు: హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. మండలంలోని కొక్కంటిక్రాస్ వద్ద జరుగుతున్న లైనింగ్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లైనింగ్ పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అనంతరం ఇంతవరకు ఎన్ని కిలోమీటర్ల పనులు చేశారని, ఏఏ యంత్రాలను పనులకు కోసం వినియోగిస్తున్నారని ఆరా తీశారు.

పురం కమిషనర్ ఆర్థిక లావాదేవీలను ఆపండి

చిలమత్తూరు: 'హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా సంగం శ్రీనివాసులు గడువు పూర్తయింది. ఆయనకు కమిషనర్ హోదా జీతం ఇవ్వొద్దు' అని న్యాయవాది గోవిందరాజులు సబ్‌ట్రెజరీ, జిల్లా ట్రెజరీ కార్యాలయాలకు లేఖ రాశారు. శ్రీనివాసులు పదవీకాలం 9వ తేదీతోనే పూర్తయిందన్నారు. ఆయన తన మాతృశాఖ డీఆర్‌డీఏ కార్యాలయంలో ఇప్పటికే రిపోర్ట్ చేసుకోవాల్సి ఉన్నా ఇంకా పదవిలోనే కొనసాగుతున్నారన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 22న ఆయనకు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పచెబుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే ఉత్తర్వు ప్రతిలో ఈ ఏడాది మే 9వ తేదీన డీఆర్‌డీఏలో రిపోర్టు చేసుకోవాలని పేర్కొన్నారన్నారు. అయినా ఆయన తన పదవి లోనే కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆయన ఆథరైజేషన్‌తో వచ్చే వాటిని స్వీకరించొద్దన్నారు. దీనిపై 'సాక్షి' మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్ కోరగా.. సంగం శ్రీనివాసులు పదవీ కాలం ఈనెల 9తో ముగిసిన విషయం వాస్తవమేనన్నారు. అయితే ఆయనకు ఇచ్చిన ఉత్తర్వుల్లో రీపాట్రియేషన్ అంశం లేదని, అందువల్ల డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ వంచన

తాడిపత్రి టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానంటూ మిత్రద్రోహానికి పాల్పడి రూ.లక్షలతో ఓ స్నేహితుడు ఉడాయించిన ఘటన తాడిపత్రిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా రాయచోటికి చెందిన బుగ్గనపల్లి మహేశ్వరరెడ్డి 2015-19 విద్యాసంవత్సరంలో అనంతపురంలోని ఓ ఫార్మసీ కళాశాలలో చదువుకున్నాడు. అదే కళాశాలలో జూనియర్ విద్యార్థిగా ఉన్న తాడిపత్రిలోని శ్రీనివాసపురానికి చెందిన ఎండీ యాసీన్ ఇలాహితో పరిచయమై, ఇద్దరి మధ్య స్నేహం బలపడింది. చదువులు పూర్తయిన తర్వాత అప్పుడప్పుడు ఇద్దరూ కలుసుకుని మాట్లాడుకునేవారు. గత ఏడాది యాసిన్ ఇలాహికి మహేశ్వర్‌రెడ్డి ఫోన్ చేసి తనకు తెలిసిన ఓ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. నెలకు రూ.1.15 లక్షలు ఇస్తారని, కటింగ్‌లన్నీ పోను రూ.90 వేల వరకు చేతికి అందుతుందని, ఆన్‌లైన్ ద్వారానే పనిచేయవచ్చునని వివరించి, వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు తీసుకున్నాడు. రెండు రోజుల తర్వాత యాసిన్ ఫోన్ నంబర్‌కు ఓ యువతి కాల్ చేసి, ఐకాన్ ఫార్మా కంపెనీ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా పరిచయం చేసుకుని వర్చువల్‌గానే ఇంటర్వ్యూ చేస్తున్నట్లు తెలిపింది. తర్వాత అదే రోజు సాయంత్రం జాబ్‌కు ఎంపికైనట్లు సమాచారం అందించారు. ఈ క్రమంలో మహేశ్వరరెడ్డి ఫోన్ చేసి కంపెనీ హెచ్ఆర్‌లు డబ్బు అడుగుతున్నారని, రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందని తెలపడంతో ఆ మొత్తాన్ని మహేశ్వరరెడ్డికి ఫోన్‌పే ద్వారా యాసిన్ చెల్లించాడు. మరుసటి రోజు మహేశ్వరరెడ్డి మళ్లీ ఫోన్ చేసి హెచ్ఆర్ హెడ్‌కూ డబ్బు ఇవ్వాల్సి వస్తోందని, మరో రూ.లక్ష పంపాలని తెలిపాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని యాసిన్ తెలిపి విడతల వారీగా మహేశ్వరరెడ్డికి ఫోన్‌పే ద్వారా రూ.86 వేలను చెల్లించాడు. రెండు నెలల్లో అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందని తెలపడంతో యాసిన్ ఎదురు చూశాడు. మూడు నెలలైనా ఎలాంటి స్పందన లేకపోవడంతో మహేశ్వరరెడ్డికి కాల్ చేశాడు. అప్పటికి సమాధానమిచ్చిన ఆయన ఆ తర్వాత యాసిన్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లు నిర్ధారించుకున్న యాసిన్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం మహేశ్వరరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

- డీఎస్పీ విజయ్‌కుమార్


'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: సమష్టి కృషితో జిల్లాను డ్రగ్స్ రహితంగా మారుద్దామంటూ పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సాయిఆరామం వేదికగా ఈగల్ యాంటీ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయికి అలవాటు పడి చాలా మంది తమ జీవితాలను నాశనంచేసుకుంటున్నారన్నారు. అలాంటి వారు తమ కుటుంబాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం తదితర వివరాలు గురించి తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐలు సునీత, సురేష్, ఈగల్ యాంటీ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, ఎస్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ నిబంధనల్లో అసంబద్ధాలను తొలగించాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య


డీఎస్సీ మోడల్ ప్రశ్న పత్రాన్ని విడుదల చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ధర్మవరం అర్బన్: ఉపాధ్యాయ బదిలీల నిబంధనల్లో నెలకొన్న అసంబద్ధాలను తొలగించాలని ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక సాయికృప జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్జీటీలకు సెమీ మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో హెచ్ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లకు బదులు ఎల్ఎఫ్ఎల్ పదోన్నతుల ద్వారా ఎస్జీటీలను నియమించాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల స్థాయిని దిగజార్చకుండా వారిని యూపీ, ఉన్నత పాఠశాలలకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. 2023లో రేషనలైజేషన్ అయి ప్రమోషన్ పొందిన వారికి, 2025లో రేషనలైజేషన్ అవుతున్న వారికి బదిలీల్లో అన్యాయం జరగకుండా చూడాలన్నారు. స్టడీ లీవ్‌లో ఉన్న వారి పోస్టులను వేకెంట్ చూపరాదన్నారు. అంతర్ జిల్లా బదిలీలు కూడా వెంటనే చేపట్టాలన్నారు. మూడేళ్లలోపు రిటైర్మెంట్ ఉన్నవాళ్లను బదిలీ నుంచి మినహాయించాలన్నారు. కౌన్సిలింగ్‌కు ముందే హైస్కూల్ ప్లస్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. రాష్ట్రమంతటా ఒకేసారి ఆఫ్‌లైన్‌లో ఓఎంఆర్ ద్వారా డీఎస్సీని నిర్వహించాలన్నారు. అనంతరం డీఎస్సీ మోడల్ ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు సి.రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, నారాయణస్వామి, సౌదామిని, శివారెడ్డి, సంజీవ్, శ్రీరామ్‌నాయక్, చిదంబరరెడ్డి, బాలకృష్ణ, రామయ్య, రమణ, ఓబిరెడ్డి, చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, రామ్మోహన్‌రెడ్డి, సాలెహ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని వెంకటగారిపల్లి సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన సాయినాథ్ (26) సీసీ కెమెరాల మరమ్మతు పనితో కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గోరంట్ల నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి ప్రయాణమైన సాయినాథ్... వెంకటగారిపల్లి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సంప్‌లో పడి వృద్ధురాలి మృతి

పుట్టపర్తి అర్బన్: ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. వివరాలు.. పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామానికి చెందిన ఫకృద్దీన్ ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడడంతో భార్య చక్కీరమ్మ (70)తో కలిసి ప్రశాంతిగ్రామంలోని జానకీరాం కాలనీలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సంప్‌లోని నీళ్లు తీసుకునేందుకు వెళ్లిన చక్కీరమ్మ అదుపు తప్పి అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి ఊపిరి ఆడక మృతిచెందారు. ఘటనపై పుట్టపర్తి రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థులు


విద్యార్థుల చేతుల మీదుగా నగదు అందజేస్తున్న దృశ్యం

అగళి: నడిరోడ్డుపై తమకు దొరికిన సంచిలో ఉన్న నగదును పోలీసుల ద్వారా సంబంధీకుడికి అప్పగించి, విద్యార్థులు తమ నిజాయితీని చాటుకున్నారు. వివరాలు.. అగళి మండలం ఆలూడి గ్రామానికి చెందిన నరసింహ, మలుర... స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు రాసి తిరుగు ప్రయాణమయ్యారు. కర్ణాటక బ్యాంక్ వద్దకు చేరుకోగానే నడిరోడ్డుపై ఓ బ్యాగ్ కనిపించడంతో తీసుకుని పరిశీలించారు. అందులో పెద్ద మొత్తంలో నగదు ఉండడంతో నేరుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆ బ్యాగ్‌ను అందజేసి, విషయాన్ని వివరించారు. బ్యాగ్‌లో ఉన్న బ్యాంక్ పాస్ పుస్తకాన్ని పరిశీలించిన పోలీసులు ఆ నగదు గ్యార గుండానపల్లి చెందిన శివన్నది గుర్తించి, పీఎస్‌కు రప్పించుకుని ఆరా తీశారు. గ్రామంలోని మహాత్మా గాంధీ మహిళ సంఘానికి చెందిన డబ్బును అగళిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో కట్టేందుకు తీసుకువచ్చినట్లు వివరించాడు. అయితే నగదు ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకోవడంతో దిక్కు తోచలేదని, అందులో రూ.49,310 నగదు ఉండాలని తెలిపాడు. దీంతో లెక్కించిన పోలీసులు ఆ మొత్తం అందులో ఉండడంతో విద్యార్థుల చేతుల మీదుగా ఆయనకు అందజేయించారు. నిజాయితీ చాటుకున్న విద్యార్థులను ఈ సందర్భంగా పోలీసులు అభినందించారు.

హనుమజ్జయంతికి ముస్తాబు

- కసాపురంలో రేపటి నుంచి హనుమజ్జయంతి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో రేపటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ ఈఓ కె.వాణి తెలిపారు. 18న నెట్టికంటి ఆంజనేయ స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవ మూర్తికి తులసీ దళాలతో లక్షార్చన చేస్తారు. 19న నెట్టికంటి ఆంజనేయ స్వామిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించనున్నారు. అదే రోజు సాయంత్రం ఉత్సవ మూర్తికి సింధూరంతో లక్షార్చన నిర్వహిస్తారు. 20న మూలవిరాట్‌ను గంధంతో అలంకరిస్తారు. సాయంత్రం ఉత్సవ మూర్తికి తమలపాకులతో లక్షార్చన చేస్తారు. 21న యాగశాలలో హోమాలు నిర్వహించిన అష్టోత్తరశతకలశాలతో స్వామికి మహాభిషేకం చేయనున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తికి మల్లెపూలతో లక్షార్చన నిర్వహిస్తారు. 22న హనుమజ్జయంతి సందర్భంగా మూలవిరాట్‌ను స్వర్ణ, వజ్ర కవచాలతో అలంకరిస్తారు. ఆలయ ముఖ మండపంలో ఉదయం 9 గంటల నుంచి శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి పూర్ణాహుతితో ఉత్సవాలను ముగిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఆంజనేయ స్వామిని ఒంటి వాహనంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహిస్తారు.

పలు మండలాల్లో వర్షం


గుడిబండ సమీపంలో పత్తిపంటలో నిలిచిన నీరు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం తెల్లవారుజామున వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని గుడిబండ మండలంలో అత్యధికంగా 35.2 మి.మీటర్లు, రొళ్ల 21.2, గాండ్లపెంట 20, మడకశిర 6, అగళి మండలంలో 5.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

వాహనం బోల్తా.. ఒకరి మృతి


తాడిపత్రి: మండలంలోని ఇగుడూరు గ్రామం వద్ద బొలెరో లగేజీ వాహనం బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కొందరు కర్ణాటక ప్రాంతంలో కొనుగోలు చేసిన జీవాలను బొలెరో లగేజీ వాహనంలో ఎక్కించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం ఇగుడూరు గ్రామం వద్దకు చేరుకోగానే టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పి రహదారిపై బోల్తాపడింది. ఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన చాంద్‌బాషా (45) అక్కడికక్కడే మృతి చెందాడు. షేక్ హుస్సేన్ బాషా, ఎర్రగుంట్లకు చెందిన ఆంజనేయులు, గంగప్రతాప్ గాయపడ్డారు. ఘటనపై రూరల్ పీఎస్ సీఐ శివగంగాధరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తాపడిన ఘటనలో మరొకరు..

పామిడి: మండలంలోని రామరాజుపల్లి సమీపంలో ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నాగేంద్ర తన సొంత ఆటోలో కుటుంబసభ్యులతో కలసి పెన్నహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు వెళ్లాడు. శుక్రవారం ఆలయం వద్ద పూజలు ముగించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమైన వారు... పామిడి మండలం రామరాజుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో నాగేంద్ర కుమార్తె శైలజ (15) అక్కడికక్కడే మృతి చెందింది. నాగేంద్ర, సుదర్శన్, మోక్షిత, రాధమ్మకు గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు లక్ష్మీనృసింహుడి బ్రహ్మరథోత్సవం


పెన్నహోబిలంలో భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం


ముస్తాబైన ఉగ్రనరసింహుడి విగ్రహం

- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ అధికారులు

ఉరవకొండ/రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మరథోత్సవం వైభవంగా జరగనుంది. రథోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. దీంతో ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, ఉచిత భోజన వసతికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉరవకొండ ఆర్టీసీ డిపో నుంచి పెన్నహోబిలం ఆలయానికి ప్రత్యేకంగా 42 ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ హంపయ్య తెలిపారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో సీఐ, ఎస్ఐలతో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు అందుబాటులో ఉంటారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTO MOBILE

అమ్మబడును

■ **JCB : AP-39 HT 6721, Model-2020** మరియు Road Roller AP-02 BE 6634 Model-2016 మోడల్స్ అమ్మకమునకు కలవు. కావలసిన వారు సంప్రదించండి. సెల్ : 9885356038, 9390111721. [A-840]

EDUCATION

పాలిటెక్నిక్ అడ్మిషన్స్

■ **10th పాస్ + AP POLYCET లో** క్వాలిఫైడ్ స్టూడెంట్స్ కి Diploma (POLYTECHNIC) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, ఫ్రీ హాస్టల్ కలదు. Cont : G MURALI, 9030661651, అనంతపురం. [A-1619]

అడ్మిషన్

■ **GNM (Nursing) పాస్ స్టూడెంట్స్‌కి** Post B.Sc (Nursing) నందు Goverment సీట్స్ కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్. సంప్ర: G.మురళి, 9030661651, అనంతపురం. [A-1615]

పాలిటెక్నిక్ Spot అడ్మిషన్స్

■ **AP POLYCETలో క్వాలిఫై కానీ స్టూడెంట్స్‌కి** మరియు పాలీసెట్ రాయని వారికీ Diploma (POLYTECHNIC) కోర్స్ నందు. ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. హాస్టల్ ఫీజు మాత్రమే కట్టాలి. Cont:- G.MURALI, 9030661651, అనంతపురం. [A-6488]

REAL ESTATE

■ **SLV INFRA PROJECT లో Plots మరియు** Weekend Homes డెవలప్‌మెంట్స్, బ్యాంక్ లోన్ సౌకర్యం తక్కువ ధరలో కలవు. మార్కెటింగ్ వాళ్లు కావలెను. సెల్: 8886112129. [A-1616]

PLOT FOR SALE

■ అరవకూరు దగ్గర బళ్లారి హైవేకి మొదటి బిట్టు, ఎయిర్ పోర్ట్ కు దగ్గరలో, 30 సెంట్స్ అమ్మకానికి కలదు. సంప్ర: 8688397109. [SCA25003648]

LAND FOR SALE

■ కర్నూలు జిల్లా జగదుర్తి నందు (on NH 44) - 51 ఎకరాల సాగు భూమి (ఎకర 21 లక్ష రూ॥) అమ్మకానికి ఉన్నది. Ph: 9848389311. [A-1621]

SERVICES

CHANGE OF NAME

■ **I, KURUKUTI VIJAYA (Old Name)** W/o ANNAM JAGANNATH, R/o 28-3-486, Ground floor, First main, Sarada Nagar, Anantapur (T&D), A.P. I changed my NAME to ANNAM VIJAYA. Henceforth, I will be known as ANNAM VIJAYA W/o ANNAM JAGANNATH for all purpose. [A-1620]

WANTED

■ **అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఉన్న** ఎడ్యుకేషనల్ సర్వీస్ Office లో టెలికాలర్స్‌గా Work చేయడానికి Females కావలెను. సెల్: 8977502169. [A-3975]

■ **కాలేజ్ అడ్మిషన్స్ చేయుటకు లేడీ** టెలికాలర్స్ కావలెను. Exp: 2 సం॥, Q: ఏదైనా డిగ్రీ, @ టవర్ క్లాక్ దగ్గర, ATP. 9980713022, 9985832629. [A-6487]

■ **శ్రీ శ్రీకర హాస్పిటల్, నవోదయ కాలనీ,** Atp లో పనిచేయుటకు అనుభవం కల నర్సులు, క్లీనింగ్ అయాలు, వాచ్ మెన్ & మెడికల్ షాప్ లోకి సిబ్బంది కావలెను. సెల్: 9440923289. [SCA25003705]

■ **APSRTC ఇంద్ర A/C బస్సులలో** అటెండర్స్ & గుత్తి డిపో నందు శ్రామికులుగా & హిందూపూర్ డిపో నందు బస్సులకు డీజిల్ పట్టుటకు వర్కర్లు కావలెను. సంప్రదించవలసిన నెంబర్లు 7989636359/9492553313 [A-1618]

■ **శిరిగుప్ప ఎడ్యుకేషనల్ సొసైటీ, శిరుగుప్ప** నందు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సబ్జెక్టులకు (E.M) అనుభవం కలిగిన టీచర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + వసతి సౌకర్యం కలదు. సెల్: 9949990888. [A-6483]

■ **అనంతపురంలోని కిరాణా బజార్** స్టోర్స్ నందు పని చేయుటకు స్టోర్ సూపర్ వైజర్స్ కావలెను. మహిళలు మాత్రమే సంప్రదించండి. Qua: డిగ్రీ. సెల్: 7013665870. [SCA25003444]

■ **త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను** పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18k Ph: 9160900024, 9640400073 [SCA25003536]

■ **WANTED EXPERIENCED FEMALE** STAFF For NUR, LKG, UKG, PRIMARY CLASSES (I-V) All Subjects, COMPUTERS & LUCIDA H.W. DANCE & YOGA TO WORK IN BLOSSOMS SCHOOL, ARAVINDNAGAR, ATP. MOB:9030777676. [SCA25003592]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.